ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో - ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

- అభివృద్ధి చేసి చూపించిన వ్యక్తి సీఎం జగన్ మోహన్‌రెడ్డి
- మరోమారు ముఖ్యమంత్రిగా ఆశీర్వదించండి
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



వైఎస్సార్ సీపీ రీజినల్ కో - ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

పద్మనాభం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ రీజినల్ కో - ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని రేవిడిలో శనివారం రాత్రి జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ భీమునిపట్నం నియోజకవర్గంలో 3.40 లక్షల మంది ఓటర్లు ఉండగా వారిలో 1.41లక్షల మంది వద్దకు జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా గృహసారథులు, నాయకులు వెళ్లి రాబోయే రోజుల్లో వారు ఏమి కావలనుంకుంటున్నారో తెలసుకున్నారన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుయుక్తులు పన్నినా జనం నమ్మరన్నారు. పాదయాత్రలో వైఎస్ జగన్ మోహన రెడ్డి ఇచ్చిన హామీలన్నింటినీ నేరవేర్చారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలు, పేదల సంక్షేమం, అభివృద్ధిని చేసి చూపించిన వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. టీడీపీ పాలనలో గ్రాఫిక్స్ చూపిస్తే, సీఎం జగన్ వాస్తవంగా అభివృద్ధి చేసి చూపించారన్నారు. రాబోయే ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించి మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. నిరంతరం ప్రజల్లో ఉంటున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావును రాబోయే ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు.

భీమునిపట్నం అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

భీమునిపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని వైవీ సుబ్బారెడ్డి అన్నారు. అందుకే నియోజవర్గంలోని కాపులుప్పాడ కేంద్రంగా త్వరలో పాలన సాగించాలనుకుంటున్నారన్నారు. కాపులుప్పాడలో వచ్చే నెల 3న రూ.14,634 కోట్లతో 130 ఎకరాల్లో అదానీ కంపెనీ టక్ సెంటర్ నిర్మాణానికి సీఎం జగన్ శంకుస్థాపన చేస్తారన్నారు. ఈ కంపెనీ వల్ల 39 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికలకు రెండేళ్ల ముందు నుంచి ''గడప గడపకు మన ప్రభుత్వం'' కార్యక్రమం నిర్వహించడం వల్ల వైఎస్సార్ సీపీకి ప్రజల్లో మంచి స్పందన లభిస్తోందన్నారు. చంద్రబాబునాయుడుకు మాయ మాటలు చెప్పడం అలవాటన్నారు. తమది చేతల ప్రభుత్వమన్నారు. రాష్ట్రంలో లంచాలు తీసుకోకుండా పరిపాలన సాగాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటేయాలన్నారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి కేక్ కట్ చేశారు. మహారాజుపేట జంక్షన్ వద్ద వైవీ సుబ్బారెడ్డికి కోలాటం, తప్పిటగుళ్లతో ఘన స్వాగతం పలికి భారీ బైక్ ర్యాలీ మధ్య రేవిడి తీసుకొచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ భీమునిపట్నం ఎన్నికల పరిశీలకుడు పసుపులేటి బాలరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచలి సూర్యనారాయణ, నాయకులు కోన రమణ, సీర సూరప్పడు, మజ్జి శంకర్, మరగడ అప్పారావు, అముజూరి అప్పారావు, బోని సన్యాసినాయుడు పాల్గొన్నారు.



మహారాజుపేట జంక్షన్ నుంచి రేవిడి గ్రామానికి ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

క్లుప్తంగా

బోయివీధికి రెండు బోర్‌వెల్స్

భీమునిపట్నం: జీవీఎంసీ 3వ వార్డు బోయివీధి ప్రాంతానికి రెండు బోర్‌వెల్స్ మంజూరు కావడంతో ఏర్పాటు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు తాగునీటి సమస్య ఉందని, రెండు బోర్లు అవసరమని మత్స్యకారులు తెలిపారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి అధికారులను ఆదేశించడంతో బోర్ల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి వైఎస్సార్‌సీపీ నాయకుడు కదిరి ఎల్లాజీ పనులను పర్యవేక్షించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



పైడినాయుడు కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న నాదెండ్ల మనోహర్

పద్మనాభం : మండలంలోని కృష్ణాపురంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన జనసేన క్రియాశీలక సభ్యుడు బొడ్డు పైడినాయుడు కుటుంబానికి ఆ పార్టీ తరఫున పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ రూ.5 లక్షల చెక్కు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ జనసేన క్రియాశీలక సభ్యులు, నాయకులు మృతి చెందితే పార్టీ తరఫున రూ.5లక్షలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో భీమునిపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి సందీప్ పాల్గొన్నారు.

బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా వరప్రసాద్

ఆనందపురం : బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు పట్నాయకుని వెంకట వరప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం పార్టీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు ఎం.రవీంద్ర నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. ఆయనను పలువురు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు వసంత వర్మ, దానిస్, సాయి రమేష్ పాల్గొన్నారు.

1 నుంచి ప్రత్యేక తరగతులు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మే 1 నుంచి ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరాల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పి.ఉమారాణి శనివారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి తరగతులు నిర్వహిస్తామని, ఫెయిలైన విద్యార్థులకు ఇవి చాలా ఉపయోగకరంగా ఉంటాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కిడ్నీ బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



వినయ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ వాంబేకాలనీలో కిడ్నీ బాధిత కుటుంబాన్ని శనివారం సాయంత్రం సీపీఎం నాయకులు డి.అప్పలరాజు, రాజ్‌కుమార్ తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదరికం, అమాయకత్వంతో బతుకుతున్న కొందరి నిస్సహాయతను ఆసరాగా తీసుకుని కిడ్నీ మాఫియా రెచ్చిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బాధితుడు వినయ్ కుమార్‌ను బెదిరించి మరీ కిడ్నీ తొలగించారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో పూర్తిస్థాయిలో విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. బి.భారతి, డి.కొండమ్మ, కె.సుజాత తదితరులు పరామర్శించారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులతో డీఈవో చంద్రకళ

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈవో ఎల్.చంద్రకళ హాజరై కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పిల్లలకు సౌకర్యాలతోపాటు విద్యా బోధన, గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించామని, వాటిని పిల్లలు ఉపయోగించుకోవాలని కోరారు. మెరుగైన విద్యా బోధన కోసం విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు అందజేసిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో పైడినాయుడు, కార్పొరేటర్ లొడగల అప్పారావు, డైట్ లెక్చరర్ గొట్టేటి రవి, ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణ, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ఎన్.రాంబాబు, మాదు చంటి, సీతా మహాలక్ష్మి, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

వేములవలసలో పందుల పట్టివేత



పందులను పట్టుకుంటున్న పంచాయతీ సిబ్బంది

ఆనందపురం : మండలంలోని వేములవలస గ్రామంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న పందులను పంచాయతీ సిబ్బంది వేటాడి పట్టుకున్నారు. 'విచ్చలవిడిగా పందుల సంచారం' శీర్షికతో సాక్షి పత్రికలో శనివారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి నరసింగరావు ఆదేశాలతో సిబ్బంది గ్రామంలో పర్యటించి పందులను వేటాడి పట్టుకున్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ మొదటి రోజు ఐదు పందులు పట్టుకున్నారని, మిగతా వాటిని కూడా పట్టుకొని తరలిస్తామన్నారు. పెంపకందారులకు కూడా హెచ్చరికలు జారీ చేశామని, నివాస ప్రాంతాల్లో పందులు పెంచితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కూచిపూడిలో ఉచిత శిక్షణకు ఆహ్వానం

తగరపువలస: నాట్యరవళి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ మే ఒకటి నుంచి జూన్ 10 వరకు ఔత్సాహికులకు కూచిపూడిలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిబిరంలో ఆరేళ్లు నిండిన చిన్నారుల నుంచి పెద్దల వరకు ఎవరైనా పాల్గొనవచ్చని మాస్టర్ ఉమ్మిడి మహేష్ తెలిపారు. 50 మందిని ఎంపిక చేసి ఆదర్శ నగర్ – గొల్లవీధి వద్ద డ్యాన్స్ క్లాసులు నిర్వహిస్తామన్నారు. వీరికి రోజూ సాయంత్రం 6 నుంచి 8 వరకు క్లాసులు నిర్వహించనున్నట్టు తెలిపారు. 40 రోజుల శిక్షణ అనంతరం క్లాసికల్, సెమీ క్లాసికల్, జానపద నృత్యంలో కూడా శిక్షణ ఇస్తామన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జూన్ 7, 8, 9వ తేదీల్లో ప్రదర్శనలో అవకాశం కల్పిస్తామన్నారు. వివరాలకు 94400 41395లో సంప్రదించాలని కోరారు.

కిషోర్‌కుమార్‌కు పలువురి నివాళి



కిషోర్‌కుమార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి గుడివాడ అమరనాథ్

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు రంగూరి కిషోర్‌కుమార్‌కు రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్, ఆయన సతీమణి హిమగౌరి శనివారం నివాళులర్పించారు. చిట్టివలస శ్రీలక్ష్మి శ్రీనివాస కల్యాణ మండపంలో జరిగిన సంతాపసభలో మంత్రి పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తెలగా సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు రంగూరి రాంబాబు, మాజీ కౌన్సిలర్ కొప్పల రమేష్, ఎస్సీ సెల్ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, కిషోర్‌కుమార్ కుటుంబ సభ్యులు రంగూరి గిరిధర్, గణేష్ కన్నా, సుందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో తగాదాలు

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం పంచాయతీలో ఈ నెల 18 నుంచి మే 7 వరకు జరుగుతున్న క్రికెట్ పోటీల్లో పెదనాగమయ్యపాలెం, చిప్పాడ పంచాయతీల జట్ల మధ్య ఇటీవల తగాదాలు చోటు చేసుకున్నాయి. ఇందులో ఒకరిని ఒకరు తోసుకున్నారు. దీనిపై ఇరువర్గాల క్రీడాకారులు భీమిలి పోలీసులకు ఒకరిపై ఒకరు ఇటీవల ఫిర్యాదు చేశారు.

ఇందుకు సంబంధించిన వివాదం శనివారం చిప్పాడ పంచాయతీ సిటీనగర్‌లో మరోమారు రాజుకున్నట్టు తెలియడంతో పోలీసులు విచారన చేస్తున్నారు.

బాలల హక్కుల పరిరక్షక నగరంగా విశాఖ

దొండపర్తి: అందరి సహకారంతో బాలల హక్కుల పరిరక్షక నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్ వర్మ తెలిపారు. ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం శనివారం సీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నగరంలో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పోక్సో కేసులు, బాలల అక్రమ రవాణా, విద్యా సంస్థల పరిసరాల్లో మత్తు పదార్థాల సరఫరా వంటి అంశాలపై చర్చించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులకు బాలల హక్కులు, చట్టాలపై సమగ్ర శిక్షణ ఇస్తామన్నారు. బాల్యవివాహాలపై ఎఫ్ఐఆర్, పిల్లలతో యాచక వృత్తి చేయిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని సీతారాం సీపీ కలిసిన వారిలో లవకుశ ఉన్నారు.

చిరు ధాన్యాల కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి

ఆనందపురం : చిరు ధాన్యాలకు ప్రస్తుతం గిరాకీ ఉన్నందున రైతులు ఎక్కువ కమతాలలో సాగు చేస్తే వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి చెప్పారు. మండలంలోని తర్లువాడలో శనివారం అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరం సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాగులు, కొర్రలు, సాములు, ఊదలు వంటి చిరు ధాన్యాల సాగుని ప్రోత్సహించడానికి ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. చిరుధాన్యాలను ప్రభుత్వమే కొనుగోలు చేసి అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం కోసం అందించడానికి యోచిస్తోందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ డీపీడీ మోహన్ రావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా సేంద్రియ ఉత్పత్తులు పెంచి అధిక ధరకు విక్రయించవచ్చన్నారు. వాటి నిల్వ కోసం గిడ్డంగులను కూడా నిర్మిస్తున్నామని చెప్పారు. ఏపీఎంఐపీ ఏపీడీ రహీం తుంపర్ల, బిందు సేద్యంపై అవగాహన కలిగించారు. పోస్టర్ విడుదల చేసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఉద్యానవనాల శాఖాధికారి మన్మథరావు, జిల్లా శిక్షణాధికారి సుబ్రహ్మణ్యం, మండల వ్యవసాయాధికారి సీహెచ్.సంధ్యారత్న ప్రభ, వ్యవసాయాధికారులు సురేష్, శ్రీకాంత్, దీపిక పాల్గొన్నారు.

మినీ గోకులాల పూర్తికి లబ్ధిదారులకు అవకాశం



లబ్ధిదారుకు సమాచార పత్రాన్ని అందజేస్తున్న పశుసంవర్థక శాఖ సిబ్బంది

ఆనందపురం : పశువుల సంరక్షణ కోసం మంజూరు చేసిన మినీ గోకులాల (పశువులు షెడ్లు)ను లబ్ధిదారులు పూర్తి చేసుకుంటే ప్రభుత్వం బిల్లులు చెల్లించడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు పశు సంవర్థక శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులకు సమాచారం చేరవేస్తున్నారు. రైతుల వాటా చెల్లించగా ప్రభుత్వం 90 శాతం నిధులు సమకూరుస్తోంది. మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు 200 మంది అప్పట్లో మినీ గోకులాల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారిలో కొంతమంది పనులు చేపట్టక, తాము చెల్లించిన వాటా సొమ్ముని తిరిగి తీసుకున్నారు. ఇంకా మండలంలోని వివిధ గ్రామాల్లో 107 మినీ గోకులాలు వివిధ దశల్లో నిర్మాణాలు జరుపుకొని ఉన్నట్టు గుర్తించారు. రెండు పశువులు గల వారికి లక్ష, నాలుగు పశువులు గల వారికి రూ.1.40 లక్షలు, ఆరు పశువులు గల వారికి రూ.1.80 లక్షలు చొప్పున ప్రభుత్వం తరఫున సాయం అందనుంది. పనులు సగంలో ఉండిపోయిన వాటిని గుర్తించి రైతులకు లబ్ధి చేకూర్చడానికి నిర్ణయించి సిబ్బందితో సమాచారం అందజేస్తున్నారు. ప్రతి మినీ గోకులం వద్ద పైకప్పుతో పాటు నీటి తొట్టె, పశుగ్రాశం తొట్టెలు తప్పని సరిగా నిర్మించాలి. ఇప్పటికే పూర్తి చేసిన వారితోపాటు, మే 31 లోపు మిగిలిన పనులను పూర్తి చేసుకుంటే లబ్ధిదారులకు బిల్లులు అందజేస్తారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి లీలారాణి మాట్లాడుతూ లబ్ధిదారులందరికీ క్షేత్రస్థాయి సిబ్బందితో సమాచారం అందజేస్తున్నామని, నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి వెంటనే బిల్లులు అందించడానికి ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.

అధికారులు నిష్పక్షపాతంగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం: అధికారులంతా నిష్పక్షపాతంగా పని చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు అధ్యక్షతన పద్మనాభం మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి వలంటీర్ల ద్వారా తీసుకెళ్లాలన్నారు. ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులందరికీ న్యాయం చేయాలని, ఇనాం గ్రామాలైన కృష్ణాపురం, పద్మనాభం, బి.ఆర్.తాళ్లవలసలో సర్వే చేయాలని తహసీల్దార్ శ్రీవల్లీని ఆదేశించారు.

నెలలో పది రోజులు అన్ని సచివాలయాలను సందర్శించి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పనితీరుపై నివేదిక అందజేయాలని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్‌ను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, ఆర్బీకేలను జూన్ ఒకటిలోగా పూర్తి చేయాలన్నారు. అభివృద్ధి జరగలేదని టీడీపీ నాయకులు చేసిన సెల్ఫీ ఛాలెంజ్‌కు దీటుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతి గ్రామ పంచాయతీలో ఫ్లెక్సీలు పెట్టి టీడీపీ నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. 20 ఏళ్ల టీడీపీ పాలనలో పాండ్రంగి సమీపాన గోస్తనీ నదిపై వంతెన నిర్మాణాన్ని పట్టించుకోని నాయకులు ఇప్పుడు విమర్శలు చేయడం అర్థరహితమన్నారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు మాట్లాడుతూ పెంట నుంచి కొవ్వాడ వరకు పూర్తిగా శిథిలమైన రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కోరారు. బొత్సపేటలో రక్షిత మంచి నీటి పథకం నిర్మించి ఐదేళ్లనా ప్రారంభించలేదని బి.ఆర్.తాళ్లవలస ఎంపీటీసీ సభ్యుడు చందక పైడినాయుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రెడ్డిపల్లి ఉప సర్పంచ్ సిరుగుడి ఆదినారాయణ మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో దెబ్బతిన్న పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



చంద్రంపాలెం హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ప్రధానోపాధ్యాయుడు ఎమ్.రాజాబాబు చెప్పారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 2 కేంద్రాల్లో 614 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 56 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

సుందరీకరణకు అధిక ప్రాధాన్యం

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో సుందరీకరణ, వృక్ష సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నూతనంగా నిర్మించిన భవనాల చుట్టూ పరిసరాలను ఆహ్లాదంగా తీర్చిదిద్దే విధంగా ప్రత్యేకంగా కృషిచేస్తున్నారు. ఏయూ ఫార్మా టెస్టింగ్, ఇంక్యుబేషన్ సెంటర్ వద్ద శనివారం ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి మొక్కలు నాటారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డీన్ ఆచార్య వజీర్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



కలశాలతో నీరు తీసుకొస్తున్న మహిళలు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు బీచ్‌రోడ్ మంగమారిపేట గ్రామ దేవత శ్రీ ఎర్నిమాంబ అమ్మవారికి శనివారం భక్తులు మంగళస్నానాలు చేయించారు. ముందుగా కలశాలతో పసుపు నీరు తీసుకొచ్చి ఆలయంలో గల శ్రీ ఎర్నిమాంబ, శ్రీ నూకాలమ్మ, శ్రీ పరదేశమ్మ, శ్రీ పెద్దఅమ్మవారు తల్లి, శ్రీ పైడితల్లి అమ్మవార్లకు మంగళ స్నానం చేయించి, ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆదివారం సాయంత్రం 3 గంటల నుంచి శ్రీ ఎర్నిమాంబ అమ్మవారి ఓడ ఊరేగింపు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రతి కార్మికుని భద్రత యాజమాన్యానిదే



మాట్లాడుతున్న కర్మాగారాల శాఖ డైరెక్టర్ చంద్రశేఖర్ వర్మ

తగరపువలస: కర్మాగారాల్లో పనిచేసే ప్రతి ఉద్యోగి, కార్మికుల భద్రత యాజమాన్యాలదేనని కర్మాగారాల శాఖ డైరెక్టర్ డి.చంద్రశేఖర్‌వర్మ అన్నారు. భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీలో భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో శనివారం ఆయన మాట్లాడారు. దివీస్ యాజమాన్యం విపత్తుల పట్ల నిత్యం అప్రమత్తంగా ఉన్నట్టు గుర్తించామన్నారు. ఏటా భద్రతా వ్యవస్థను పటిష్ఠం చేస్తుందన్నారు. ప్రతి విభాగంలో కార్మికులను ప్రోత్సహిస్తూ వివిధ రకాల పోటీలు నిర్వహించడం, ముఖ్యంగా మహిళా కార్మికులను భద్రత విషయంలో భాగస్వామ్యులను చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా భద్రతపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సంస్థ డైరెక్టర్ దివి మధుసూదనరావు మాట్లాడుతూ భద్రతా ప్రమాణాలు నెలకొల్పేందుకు ఏటా యాజమాన్యం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి.శివశంకరరెడ్డి, సంస్థ ఉపాధ్యక్షులు ఎస్.దేవేందర్‌రావు, ఎల్.వి.రమణ, జనరల్ మేనేజర్లు కె.సుబ్బారావు, వైఎస్ కోటేశ్వరరావు, ఎం.ఎస్.ఎన్.రావు, భద్రతా విభాగపు అధికారులు చంద్రశేఖర్, ఐ.ఎల్.ప్రసాద్, ఉదయకుమార్ పాల్గొన్నారు. చివరగా భద్రతకు సంబంధించి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం



మజ్జిపేటలో ఐసీటీసీ సిబ్బంది

తగరపువలస: ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సూచనలతో శనివారం చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్, సీడ్ మొబైల్ ఐసీటీసీ ఆధ్వర్యంలో భీమిలి మండలం మజ్జిపేట, పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 44 మందికి పరీక్షలు నిర్వహించారు. ఐసీటీసీ కౌన్సిలర్ అర్జున్ మాట్లాడుతూ గర్భిణులు విధిగా రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం కరోనాపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో మజ్జిపేట సర్పంచ్ మజ్జి సూరినాయుడు, లింక్ వర్కర్ జ్యోతి, ఎల్‌టీ కిషోర్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.